క్లుప్తంగా

వచ్చే నెల 3న కార్తిక వన సమారాధన

అమలాపురం టౌన్: స్థానిక వడ్డిగూడెం రామాలయం వద్ద వచ్చే నెల 3వ తేదీన వడ్డీల కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు నగభేరి వెంకట రమణమూర్తి తెలిపారు. మంగళవారం వడ్డిగూడెంలో వనసమారాధన నిర్వహణపై చర్చించేందుకు సంఘ సభ్యులంతా సమావేశమయ్యారు. కార్తిక వన సమారాధనకు కుటుంబసమేతంగా రావాలని సంఘీయులకు వెంకటరమణమూర్తి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, కార్యదర్శి బొర్రా మాషరి, కోశాధికారి నగభేరి శ్రీనివాస్, బొర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశు సంరక్షణ కార్డుల పంపిణీ



పశు సంరక్షణ కార్డులను పంపిణీ చేస్తున్న ఏడీ విజయారెడ్డి తదితరులు

అల్లవరం: పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా బోడసకుర్రు రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులకు పశు సంరక్షణ కార్డులను పశు సంవర్ధక శాఖ ఏడీ విజయారెడ్డి మంగళవారం అందజేశారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడీ విజయారెడ్డి మాట్లాడుతూ రైతులు సకాలంలో పశువులకు టీకాలు వేయించాలన్నారు. పశువులను పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలన్నారు. అనంతరం పాడి రైతులకు పశు సంరక్షణ కార్డులను అందించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఎంవీవీఎస్ఎల్ నారాయణరావు, పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే విజయవంతం చేయాలి



కుల గణన సర్వేపై సూచనలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి ఈకేవైసీ నమోదు చేయాలన్నారు. 8 ఏళ్ల కన్నా తక్కువ వయసున్నవారికి ఈకేవైసీ అవసరం లేదని చెప్పారు. సర్వేలో కుటుంబ సభ్యుల కోసం బయోమెట్రిక్, ఐఆర్ఐఎస్, ఓటీపీ, ఫేషియల్ ద్వారా ఈకేవైసీ తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రైస్తవ పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కొమానపల్లి

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువులో రోడ్డు లేమెస్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ చర్చి ఆవరణంలో చర్చ్ నిర్వాహకులు పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేశారు. జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కార్ల్ డేవిడ్ కొమానపల్లి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు అవసరమయ్యే పుస్తకాలన్నీ అందుబాటులో ఉంటాయని, క్రైస్తవులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘ పాస్టర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ 26వ తేదీ వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సత్యం, స్థానిక చర్చ్ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మధ్యాహ్న భోజనం తనిఖీ



ఐటీఐలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: స్థానిక సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను రోజువారీ మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహారం మంచి పోషక విలువలు కలదిగా ఉండాలని ప్రభుత్వం సూచించిన విధంగా మెనూను పాటించాలని అధ్యాపక సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, నాయకులు ఖాలేషా తదితరులు పాల్గొన్నారు.

పదే పదే అగ్గి.. బుగ్గి..

- అమలాపురం డంపింగ్ యార్డులో మళ్లీ మంటలు, పొగలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న స్థానిక ప్రజలు
- రాత్రిళ్లు అక్కడేదో జరుగుతుందంటూ చర్చ



అమలాపురం డంపింగ్ యార్డ్‌లో చెలరేగిన మంటలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ శివారు బైపాస్‌రోడ్డులోని డంపింగ్ యార్డులో పదే పదే మంటలు ఎందుకు చెలరేగుతున్నాయో అంతు బట్టని ప్రశ్నగా మారింది. డంపింగ్ యార్డు చెత్త నుంచి రాత్రి వేళల్లో చెలరేగే మంటలు, పొగలతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరై అనారోగ్యంతో సతమవుతున్నారు. దీనిపై ఇప్పటికే స్థానిక ప్రజలు మున్సిపాలిటీకి అనేకసార్లు మొరపెట్టుకున్నా అగ్గి రాజుకోవడం ఆగడం లేదు. డంపింగ్‌యార్డులో అర్ధరాత్రి వేళ ఏదో జరుగుతుందన్న చర్చ సర్వత్రా సాగుతుంది.

గతంలో డంపింగ్‌యార్డులో మంటలు, పొగలు చెలరేగినపుడు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఆయా వార్డుల కౌన్సిలర్లు స్పందించి అగ్ని మాపక సిబ్బందితో నీరు పిచికారీ చేయించి అదుపు చేయించారు. కాని ఇది పదే పదే పునరావృతమవుతుండడం విమర్శలకు తావిస్తుంది. తాజాగా గత రెండు రోజులుగా డంపింగ్‌యార్డులో మళ్లీ అగ్గి రాజుకుని దట్టమైన పొగలతో పరిసర ప్రాంత ప్రజలు సతమతమవుతున్నారు. దట్టమైన పొగలు పీల్చడం వల్ల తమకు శ్వాస కోశ సంబంధమైన వ్యాధులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా డంపింగ్ యార్డ్‌కు 300 నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్న గృహస్తులు పొగలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ ఇదే డంపింగ్ యార్డ్ వద్ద కొన్నేళ్లుగా కొండలా పేరుకుపోయిన వేల టన్నుల చెత్త కుప్పలను కరిగించి రీసైక్లింగ్ చేయిస్తోంది. అక్కడ దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో చెత్త శుద్ధీకరణ ప్లాంట్‌ను నెలకొల్పి రోజూ కొన్ని టన్నుల చెత్తను వర్గీకరణ చేస్తోంది. అయితే ఏ రోజుకారోజు సేకరించే తాజా చెత్త కుప్పల వద్ద రాత్రి సమయాల్లో మంటలు రేగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.



డంపింగ్‌యార్డులో నీళ్లు చల్లి మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

నిప్పు పెట్టేదెవరు?

చెత్త కుప్పల లోపలి పొరల్లో గ్యాస్ ఉత్పత్తి కారణంగా నిప్పు పుట్టే అవకాశముందని కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు చెబుతున్నారు. అయితే మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బందే చెత్త కుప్పలకు నిప్పు పెడుతున్నారన్నది స్థానిక ప్రజల ఆరోపణ. మరో వైపు చెత్త ఏరుకోవడానికి వచ్చే కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో చెత్తకుప్పలకు నిప్పు పెట్టి బూడిదయ్యాక ఇనుప ముక్కలను తీసుకెళుతున్నారన్న వాదన సైతం ఉంది. ఏదేమైనా డంపింగ్ యార్డులో మంటలకు కారణమవుతున్న నిప్పు రాజాను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

> **మరింత పక్కాగా చర్యలు**
>
> డంపింగ్ యార్డ్‌లో తరుచూ అనివార్యమవుతున్న మంటలు, పొగలను పూర్తిగా అదుపు చేసేందుకు మరింత పక్కాగా చర్యలు చేపడతాం. మంటలు చెలరేగినప్పుడల్లా మున్సిపాలిటీ వాటర్ ట్యాంకర్‌ను పంపించి నీళ్లు చల్లించి అదుపుచేస్తున్నాం. నీటి పిచికారీ కోసం శాశ్వతంగా ఓ జనరేటర్‌ను కొనుగోలు చేసి అక్కడ ఏర్పాటు చేస్తాం.
>
> – ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

అన్నదాతల గుండెల్లో గుబులు

- వర్షాలతో వరి కోతల వాయిదా
- పలుచోట్ల నేలకొరిగిన వరి పంట



దేవగుప్తంలో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి చేను

అల్లవరం: అన్నదాత ఆరుగాలం కష్టించి పండించిన పంట సరిగ్గా చేతికందే సమయానికి వరుణుడు కన్నెర్రజేస్తున్నాడు. రైతులు వరి కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో సోమవారం రాత్రి కురిసిన వర్షం రైతుల గుండెల్లో అలజడి రేపింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో అల్లవరం మండలంలో అనేకచోట్ల వరి చేలు నేల కొరిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీంతో ఏం జరుగుతుందోనని రైతులంతా ఆందోళన చెందుతున్నారు.

ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు కురిసినా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు పడలేదు. దీంతో అధిక దిగుబడులు వస్తాయని రైతులంతా అంచనా వేశారు. ఉప్పలగుప్తం మండలంలో గోపవరం, చల్లపల్లి, సిరిపల్లి గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. అమలాపురం రూరల్ పరిధిలో పాలగుమ్మిలో వరికోతలు ప్రారంభమైనా వర్షాల ప్రభావంతో నిలిపివేశారు. అల్లవరం మండలంలో పంట చేతికి వచ్చే దశలో ఉన్నాయి. ఇప్పటికే కోడూరుపాడు, బెండమూర్లంక, గూడాల గ్రామాల్లో అడపా దడపా వరి కోతలు ఆరంభించారు. ఇప్పుడు వర్షాలు కురిస్తే పండిన పంట నేలపాలయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి అల్లవరం మండలంలోని పలు చోట్ల వరి చేలు నేలకొరిగాయి. వరి చేలల్లోని ముంపు నీరు దిగే దారి లేక ఇంజిన్ల సహాయంతో బయటకు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. అక్కడక్కడా కురుస్తున్న వర్షాల కారణంగా వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

ఓటర్ల నమోదును సద్వినియోగం చేసుకోవాలి



ఓటర్ల నమోదు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా జరుగుతున్న ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక మినిసివిల్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన ఓటర్ల నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఓటు నమోదు అధికారి తిరుకోటి అర్జునరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ కార్యక్రమాలు

అల్లవరం: అర్హులైన పేదలకు సంక్షేమం అందించమే మా పార్టీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గోడి సచివాలయం వద్ద ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, పింఛన్ల పెంపు, వడ్డీ రాయితీ, డ్వాక్రా రుణాల మాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, ఇంటింటికీ వైద్యం, విద్యా దీవెన, గోరుముద్ద తదితర సంక్షేమ పథకాలతో ఏపీని అగ్రస్థానంలో ఉంచారని అందుకే సీఎం జగన్ ఈ రాష్ట్రానికి కావాలన్నారు. గోడి గ్రామంలో రూ. 16.63 కోట్ల నిధులతో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఖర్చు చేశారని తెలిపారు. సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డుని ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ రాజేశ్వరి, ఏఎంసీ డైరెక్టర్ పాటి శ్రీరామ్, గ్రామకమిటీ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్, కడలి సత్య ప్రసాద్, జల్లి ఏడుకొండలు, రేవు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే రావాలని వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జి.వేమవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, గ్రామ ఉపసర్పంచ్ మట్టా లింగమూర్తి, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, నాయకులు శ్రీపాదం శ్రీనివాసు, దెయ్యాల సత్తిబాబు, పినపోతు శ్రీను, కారే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



జి.వేమవరంలో పథకాల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎ.వేమవరంలో సంక్షేమ పథకాల బోర్డుని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్

గ్రామాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఉప్పలగుప్తం: గ్రామాల్లో సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను, విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటుచేసి గ్రామాలను ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారని, మరింత అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, సచివాలయ కన్వీనర్లు బడుగు అబ్బులు, పోలిశెట్టి వీరబాబు, తదిదరులు పాల్గొన్నారు.



గోడిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

లబ్ధిదారులకు నేరుగా సంక్షేమం

అమలాపురం రూరల్: లబ్ధిదారుడుకి నేరుగా సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. ఎ.వేమవరంలో సర్పంచ్ రావూరి వెంకటలక్ష్మి అధ్యక్షతన ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాల బోర్డు, వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందుశెట్టి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దంగేటి రుద్ర ప్రసాద్, అడపా ప్రభాకర్, వాకిపల్లి గోపి, జంగా సత్యనారాయణ, గెద్దం ఆనందరావు, దంగేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధన బందోబస్తుపై డీఎస్పీ సమీక్ష



సంఘ పెద్దలతో ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: పట్టణ శివారు కొంకాపల్లి సత్తెమ్మ తల్లి లేఅవుట్‌లో డిసెంబర్ 10న శెట్టిబలిజ సామాజిక వర్గీయులు తలపెట్టిన జిల్లా స్థాయి కార్తిక వన సమారాధనకు బందోబస్తు నిర్వహణపై డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ అదే లేఅవుట్‌లో మంగళవారం సమీక్షించారు. పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, రూరల్ సీఐ పి.వీరబాబు కూడా పాల్గొని బందోబస్తుపై చర్చించారు. వన సమారాధనకు వేల సంఖ్యలో జనం వచ్చే అవకాశాలు ఉండడంతో రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై నిర్వహణ కమిటీకి సూచనలిచ్చారు. వన సమారాధన వేడుకను ఆత్మీయ వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ కమిటీ పెద్దలకు సూచించారు. తొలుత ఆ లేవుట్ వద్ద ఉన్న సత్తెమ తల్లి ఆలయాన్ని పోలీసు అధికారులు సందర్శించారు. వన సమారాధన నిర్వహించే లే అవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ యువజన కమిటీ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్, రాయుడు సత్యరుష, వాసంశెట్టి సత్యం, దొంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరం



శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నారాయణ తదితరులు

ముమ్మిడివరం: ప్రాథమిక చికిత్సపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుంటే ఆపదలో ఉన్నవారికి వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడవచ్చని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కేఎస్ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, యువభారత్ చారిటబుల్ ట్రస్ట్, రెడ్ క్రాస్ సంస్థల ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్సలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మందికి డాక్టర్ పీఎస్ శర్మ ప్రాథమిక చికిత్సపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, పెయ్యల చిట్టి బాబు, కన్నీడి వెంకటేశ్వరరావు, వి.హరీష్ పాల్గొన్నారు.

మత్స్య సంపదకు ముప్పు వాటిల్లితే పోరాటమే

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కోరంగిలో ఘనంగా మత్స్యకార దినోత్సవ వేడుకలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: తీర ప్రాంతంలో ఏర్పాటు చేసే సంస్థల కారణంగా మత్స్య సంపదకు ముప్పు వాటిల్లితే పోరాటం తప్పదని టీటీడీ పాలకమండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కోరంగిలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే పొన్నాడ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ మత్స్యకారులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చూపుతున్న ఆదరణకు, ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు తెలిపారు. తీరంలో ఆయిల్ కంపెనీల కార్యకలాపాల వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు నష్ట పరిహారం రూపాయికి పదిపైసలు మాత్రమే ఉంటుందని, ఇకపై రూపాయికి రెండు రూపాయలు వసూలు చేస్తామన్నారు. ఆయిల్ కంపెనీలు ఏ అనుమతులు అడిగినా మత్స్యకారుల ప్రయోజనాలకు భంగం లేకుంటేనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా పలువురు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, ఎంపీపీలు రాయుడు సునీత, మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముదునూరి సతీష్‌రాజు, నేల కిషోర్‌బాబు, కుడుపూడి శంకరరావు, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్, గ్రామ సర్పంచ్‌లు పినపోతు చినకామేశ్వరరావు, పెయ్యల మంగేష్, పార్టీ మండల అధ్యక్షులు కాదా గోవిందకుమార్, పి.వెంకటపతిరాజు, ఎన్.నరసింహమూర్తి, జగతా బాబ్జి, పెన్మెత్స చిట్టిరాజు పాల్గొన్నారు.

యానాంలో నేషనల్ వర్క్‌షాప్



కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్

యానాం: వృత్తిపరంగా భాషాభివృద్ధి, రీజనింగ్ అంశాలు ప్రాధాన్యతగలవని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్‌కే కళాశాలలో రెండో రోజు కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ ప్రొఫెషనల్ డెవలెప్‌మెంట్ అనే అంశంపై నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రీజనింగ్ నైపుణ్యాల ద్వారా అభ్యాసకుల్లో విశ్లేషణాత్మక ఆలోచనా దృక్పథం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ చెల్లా నరేష్, డాక్టర్ శాంతికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రభాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ యోగేంద్రసింగ్, బి.వీరభద్రరావు, దుర్గయ్య, జేవీ సుధాకర్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఐ.పోలవరం: హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేశనకుర్రుపాలెం రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమంద్ర సుబ్బారావు, బ్రహ్మశ్రీ ఉండి దత్తు శర్మల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. సుమారు 150 మంది మహిళలు పాల్గొని దీప ప్రజ్వలన, గణపతి పూజ, అనంతరం లలిత సహస్ర నామ పూజలు చేశారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేగిరాజు గణపతిరాజు, వేగిరాజు వెంకటసత్యనారాయణరాజు, ఇందుకూరి వెంకటేశ్వరరాజు, యావనమంద లచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం




ఉప్పంగలలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కుడుపూడి శ్రీనివాస్

తాళ్లరేవు: ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మనవడు వైష్ణవ్ శివన్నారాయణ రెండో పుట్టినరోజు సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మూడు బాధిత కుటుంబాలకు రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల ఎంఎల్‌కే నగర్‌లో బాణసంచా కాలుస్తూ ప్రమాదంలో చేతిని కోల్పోయిన వ్యక్తికి రూ.10 వేలు, ఉప్పంగల పంచాయతీలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కాశి శ్రీనుకు రూ.5 వేలు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అంబటి అప్పారావుకు మరో రూ.5 వేలు అందజేశారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

అమలాపురం రూరల్: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని ఈఓపీఆర్డీ జి మల్లిఖార్జునరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమీక్షలో ఈఓపీఆర్డీ మల్లిఖార్జునరావు మాట్లాడారు. ప్రస్తుతం దోమలు విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా రోడ్లు, కాలువల పక్కన చెత్తాచెదారం ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లలో నగదు రహిత లావాదేవీలు జరపాలని స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ముమ్మిడివరం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు 21వ తేదీతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలుక మంగళవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శీలం నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల పడిపూజ

కాట్రేనికోన: మండలంలోని నడవపల్లిలో ఉమరామలింగేశ్వర ఆలయం వద్ద అయ్యప్ప మాల ధరించిన స్వాములు మంగళవారం పడి పూజ చేశారు. 108 కలశాల పూజ, కుంకుమార్చన నిర్వహించారు. కలశ పూజ కోసం అరటి చెట్టు కాండంతో 18 మెట్లతో కూడిన అయ్యప్ప ఆలయాన్ని చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారి 18 మెట్లకు కర్పూర హారతులను ఇచ్చారు. మండలం నలుమూలల నుంచి అయ్యప్ప స్వాములు విచ్చేసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ

అంబాజీపేట: ఈ నెల 18, 19 తేదీలలో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచారని తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేటలో తైక్వాండో క్రీడాకారులను మంగళవారం పలువురు అభినందించారు. 41వ సబ్ జూనియర్, 6వ కెడిట్ ఇంటర్ డిస్ట్రిక్ పోటీలు నిర్వహించారన్నారు. సబ్ జూనియర్ విభాగంలో కె.లాస్య అద్విక, జి.లహితి తేజ, కెడిట్ విభాగంలో జి.పూజితా దేవి, ఆర్.హెచ్.వి.మూర్తి తృతీయ స్థానాల్లో నిలిచారని త్రిమూర్తులు తెలిపారు. తైక్వాండో విద్యార్థులను హెచ్ఎం కె.సాయిరామ్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.